కొలువుదీరిన గణనాథులు


భక్తాపూర్‌లో గొడుగులతో తయారు చేసిన గణపయ్య


పూజలు చేస్తున్న బోథ్ ఎమ్మెల్యే దంపతులు


నేరడిగొండ: మండపం వద్ద యూత్ సభ్యులు


చించరవాడలో పూరిజగన్నాథ స్వామి ఆకారంలో..


బోథ్: సొనాలలోని రామాలయంలో కొలువుదీరిన మట్టి గణపతి


సిరికొండ: కొలువుదీరిన గణనాథుడు


ఇంద్రవెల్లి: హర్కాపూర్‌తండాలో పూజలు చేస్తున్న భక్తులు

జిల్లా వ్యాప్తంగా గణనాథులు కొలువుదీరాయి. శనివారం ఆయా గ్రామాల్లో గణపతులను ప్రతిష్ఠించి, ప్రత్యేక పూజలు చేశారు. పూలు, పత్రి, లడ్డు, నైవేద్యాలు సమర్పించారు. అందరు సుఖసంతోషాలతో ఉండాలని మొక్కుకున్నారు. నేరడిగొండ మండల కేంద్రంలోని తన నివాసంలో బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ కుటుంబ సమేతంగా గణపతి విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. జిల్లా కేంద్రంలోని శాంతినగర్‌లోని సాయి బాబా ఆలయంలో ప్రతిష్ఠించిన వినాయకుడికి మాజీ ఎమ్మెల్యే జోగు రామన్న పూజలు చేశారు. -సాక్షి, నెట్‌వర్క్


కోలిపురలో నాట్యమాడే ఆకారంలో గణనాథుడు


నార్నూర్: పూజలు చేస్తున్న యువకులు


ఆదిలాబాద్‌రూరల్: పూజలు చేస్తున్న భక్తులు


తాంసి: వడూర్‌లో మండపం వద్ద..


ఆదిలాబాద్‌టౌన్: పూజలు చేస్తున్న జోగు రామన్న

క్లుప్తంగా

దినేష్‌కు 'పాన్ ఇండియా ఐకాన్' అవార్డు

ఆదిలాబాద్‌టౌన్: పట్టణంలోని రాంనగర్‌కు చెందిన ప్రైవేట్ ఉపాధ్యాయుడు కరాండే దినేష్‌కు 'పాన్ ఇండియా ఐకాన్ టీచర్' అవార్డు దక్కింది. ఉపాధ్యాయ దినోత్సవం పురస్కరించుకొని శనివారం గుంటూర్‌లోని కన్నేడి నెక్స్ ఇంటర్నేషనల్ స్కూల్‌లో ఈ కార్యక్రమం నిర్వహించారు. సీబీఐ మాజీ జాయింట్ డైరెక్టర్ లక్ష్మీనారాయణ, కృష్ణ జిల్లా ఎమ్మెల్సీ లక్ష్మణ్‌రావు, ఎమ్మెల్యే మహ్మద్ నసీర్ అహ్మద్, గుంటూరు ఎమ్మెల్యే మాధవి చేతుల మీదుగా ఈ అవార్డు అందుకున్నారు. అవార్డు దక్కడంపై పలువురు ఆయనను అభినందించారు.

గ్రంథాలయం ప్రారంభం

ఆదిలాబాద్‌టౌన్: ఆదిలాబాద్ పట్టణంలోని మాధవ సేవ సమితి సంఘ భవనంలో ఏర్పాటు చేసిన గ్రంథాలయాన్ని ఆ సంఘం సభ్యులు ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సామాజిక బాధ్యత, జాతి సమైక్యతను పెంపొందించే సాహిత్యాన్ని పొందుపర్చడం జరిగిందన్నారు. ప్రతీ ఆదివారం ఉదయం 11 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు, సాయంత్రం 4 నుంచి 7 గంటల వరకు గ్రంథాలయాన్ని పాఠకులు వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో రిటైర్డ్ లెక్చరర్ విజయ్ బాబు, ప్రతాప్ రెడ్డి, కృష్ణకుమార్, రవీందర్, నాగరాజు, గణేష్, రాజేశ్, రమేశ్, సత్యనారాయణ, శ్రీనివాస్, గంభీర్ పాల్గొన్నారు.

గణేశ్ ఉత్సవాలను ప్రశాంతంగా జరుపుకోవాలి

ఆదిలాబాద్‌టౌన్: గణేశ్ నవరాత్రి ఉత్సవాలను ప్రశాంతంగా జరుపుకోవాలని ఆదిలాబాద్ వన్‌టౌన్ సీఐ సునీల్ కుమార్ అన్నారు. ఆదివారం ఆదిలాబాద్ పట్టణంలోని వన్‌టౌన్ పరిధిలోని గణేష్ మండపాలను సందర్శించారు. ఆన్‌లైన్‌లో వివరాలను నమోదు చేసుకోవాలని నిర్వాహకులకు సూచించారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చూడాలన్నారు. మండపాల వద్ద రాత్రి వేళల్లో కమిటీ సభ్యులు ఉండాలని సూచించారు. పట్టణంలోని పలు ముఖ్య కూడళ్లలో, గణేష్ మండపాల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడం జరిగిందని పేర్కొన్నారు. రాత్రి వేళల్లో పోలీసులతో బందోబస్తు ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు.

శ్రావణమాస భజన ముగింపు

తాంసి: భీంపూర్ మండలంలోని అర్లి(టి) గ్రామంలోని రామాలయంలో శ్రావణ మాసంలో భాగంగా నెల రోజులుగా నిర్వహిస్తున్న భజన ఆదివారం ముగిసింది. గ్రామానికి చెందిన భజన కళాకారులు ప్రతి ఏటా నిర్వహించే భజనలో గత నెల రోజులుగా ఆలయ ప్రాంగణంలో భక్తితో భజన నిర్వహించారు. అనంతరం భక్తులకు ప్రసాదాన్ని పంపిణీ చేశారు. కార్యక్రమంలో గ్రామాభివృద్ధి కమిటీ అధ్యక్షుడు కన్నాల నవీన్, నితిన్, అశోక్, భజన కళాకారులు పాల్గొన్నారు.

విద్యుత్‌షాక్‌తో ఆవు మృతి

బజార్‌హత్నూర్: మండలంలోని గంగాపూర్ పాల్వె విజయ్‌కు చెందిన ఆవు శనివారం విద్యుత్ షాక్‌తో మృతి చెందింది. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం గంగాపూర్ గ్రామంలో కేంద్రే తులసిబాయి, దహిపాడ్ సావిత్రి పంట చేన్లలో అడవిజంతువుల నుంచి పంట రక్షణ కోసం ఏర్పాటు చేసిన విద్యుత్ తీగలకు తగిలి ఆవు మృతి చెందిందని తెలిపారు. విజయ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

ముగిసిన బ్రహ్మంగారి జీవిత చరిత్ర పఠనం

నేరడిగొండ: మండలంలోని వడూర్ గ్రామంలో నాగుల చవితి రోజున వీరబ్రహ్మేంద్ర స్వామి జీవిత చరిత్ర పఠనాన్ని ప్రారంభించారు. ఆదివారంతో పఠనం కార్యక్రమం ముగిసింది. గ్రామంలో బ్రహ్మంగారి ఆలయం వద్ద గ్రామస్తులు భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. ఆయన జీవిత చరిత్రను పూజారి బ్రహ్మయ్య భక్తులకు నెల రోజుల పాటు వివరించారు. గ్రామంలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొల్పడం చాలా సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు రామకృష్ణ, బ్రహ్మంగారి భక్తులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

కనీస వేతనాలు ఇవ్వడంలో విఫలం

ఎదులాపురం: కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ విధానంలో పని చేస్తున్న ఉద్యోగులు, కార్మికులకు కనీస వేతనాలు ఇవ్వడంలో ప్రభుత్వాలు విఫలం అయ్యాయని భారతీయ మజ్దూర్ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కలాల శ్రీనివాస్ అన్నారు. జిల్లా కేంద్రంలో ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం మాట్లాడారు. కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు, కార్మికుల సంక్షేమం దిశగా ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో నాయకులు సుధీర్‌కుమార్, క్రిష్ణ, కొండల్ రెడ్డి, నరేందర్, సుధాకర్ పాల్గొన్నారు.

రైతుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి

- ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్


దుబ్బగూడ గ్రామస్తులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

ఇంద్రవెల్లి: కాంగ్రెస్ ప్రభుత్వం రైతు సంక్షేమానికి కృషి చేస్తుందని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. ఆదివారం ఉదయం మండలంలోని దొడంద, గట్టెపల్లి, దుబ్బగూడ, కేస్లాపూర్, కేస్లాగూడ, గిన్నేర గ్రామాల్లో పర్యటించారు. గణేశ్ మండపం, జగదాంబ, సేవాలాల్ మహరాజ్ ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. రైతులతో మాట్లాడి భారీ వర్షాలకు నష్టపోయిన పంటల వివరాలు అడిగి తెలుసుకున్నారు. దెబ్బతిన్న రోడ్లు, కల్వర్టులను పరిశీలించారు. శంకర్‌గూడ ప్రధాన రహదారి నుంచి గ్రామం వరకు బీటీరోడ్డు మంజూరుకు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ ప్రవీణ్‌కుమార్, ముఖడే ఉత్తం, ఎండీ మసుడ్, జహిర్, పవార్ దుదిరాం, కుమ్ర డొంగు రావ్, మోహన్‌రావ్, ఆత్రం గోవింద్ పాల్గొన్నారు.

సాంకేతిక లోపం కారణంగా రుణమాఫీ కాలేదు

ఉట్నూర్‌రూరల్: సాంకేతిక లోపం వల్ల కొంతమంది రైతులకు రుణమాఫీ కాలేదని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. ఆదివారం ఉట్నూర్ మండలంలోని నర్సాపూర్(బి), గండిగూడ గ్రామాల్లో అధికారులతో కలిసి పర్యటించారు. ముందుగా గ్రామంలో కొలువుదీరిన గణనాథుడికి పూజలు చేశారు. అనంతరం మొక్కలు నాటారు. సిబ్బందిని నియమించేలా చర్యలు ఉట్నూర్ ప్రభుత్వ ఆసుపత్రిలో ఖాళీలున్న వైద్యులు, సిబ్బందిని నియమించి రోగులకు మెరుగైన వైద్యం అందేలా చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే అన్నారు. శనివారం ఉట్నూర్ ప్రభుత్వ ఆసుపత్రిలో సూపరింటెండెంట్ ఉపేందర్ వైద్యుల కొరత ఉందని ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. ఆయన వెంట వైద్యులు మహేందర్, కపిల్, మాలతిరెడ్డి ఉన్నారు.

విద్యార్థికి అండగా అభిమన్యు వాట్సాప్ గ్రూప్


ఆర్థికసాయం చేస్తున్న అభిమన్యు గ్రూప్ సభ్యులు

నార్నూర్: జైనూర్ మండలంలోని పుల్లారా గ్రామానికి చెందిన మార్సుకోలా కృష్ణ ఐఐటీ రాయచూర్‌లో సీటు సాధించాడు. పేద కుటుంబం కావడంతో ఆర్థిక పరిస్థితి అంతంతా మాత్రంగానే ఉంది. ఈ విషయం గాదిగూడ మండలం లోకారి(బి) గ్రామానికి చెందిన మెస్రం శేఖర్ దృష్టికి వచ్చింది. అతను అభిమన్యు వాట్సాప్ గ్రూపులో విద్యార్థి ఆర్థిక పరిస్థితి గూర్చి పోస్ట్ చేశారు. దీనికి స్పందించిన పలువురు దాతలు నిరుపేద గిరిజన విద్యార్థికి రూ.60 వేలు ఫోన్ పే, గూగుల్ పే ద్వారా సాయం చేశారు. శనివారం ఉట్నూర్‌లో రాయి సెంటర్ సార్ మేడి మెస్రం దుర్గు, బీఈడీ కళాశాల ప్రిన్సిపాల్ మనోహర్ సమక్షంలో బాధిత విద్యార్థికి అందజేశారు. కార్యక్రమంలో పలువురు నాయకులు పెందుర్ దీపక్, తొడసం నాగోరావు, మెస్రం రూప్‌దేవ్, తదితరులు పాల్గొన్నారు.

పోస్టర్ ఆవిష్కరించిన ఎమ్మెల్యే


పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే శంకర్

ఆదిలాబాద్: జిల్లాస్థాయి హిందీ దినోత్సవ కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్‌ను శనివారం ఎమ్మెల్యే పాయల్ శంకర్ ఆయన నివాసంలో ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి హాజరు కావాలని హిందీ భాషా సేవా సమితి సభ్యులు ఆహ్వానించారు. ఈ సందర్భంగా సమితి జిల్లా అధ్యక్షుడు సుకుమార్ పేట్కులే మాట్లాడుతూ సెప్టెంబర్ 20న జిల్లా కేంద్రంలోని జెడ్పీ సమావేశ మందిరంలో హిందీ దినోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుందన్నారు. దివంగత గుజరాతి శివరం ప్రకాష్ గౌడ్ స్ఫూర్తితో జిల్లాలో హిందీ భాషాభివృద్ధికి కృషి చేస్తున్నామని తెలిపారు. హిందీ భాష సేవలో జిల్లాకు చెందిన ఉపాధ్యాయులు భాషావేత్తలు ఎల్లప్పుడూ ముందుంటారని వివరించారు. ఇటీవల పదోన్నతి పొందిన 85 మంది హిందీ పండితులతో పాటుగా హిందీ భాషకై విశేష సేవలందిస్తున్న 15 మంది విద్యావేత్తలకు సన్మానం చేస్తామన్నారు. విద్యార్థులకు వ్యాసరచన, ఉపన్యాస, చిత్రలేఖన పోటీలలు నిర్వహించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో సమితి ప్రధాన కార్యదర్శి ద్రోణాలే దత్తాత్రేయ, కోశాధికారి చంద్రశేఖర్ అంబేకర్, కార్యవర్గ సభ్యులు జావిద్ అలీ, భాస్కర్ ప్రధాన్, పవర్ అత్తం, శ్రీనివాస్ కాలే, జనార్దన్ ఘులే, సీతారాం పాల్గొన్నారు.

జిల్లాస్థాయి చెస్ ఎంపిక పోటీలు

ఆదిలాబాద్: జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేట్ పాఠశాలలో ఆదివారం జిల్లా చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జిల్లాస్థాయి చెస్ ఎంపిక పోటీలు ఉత్సాహంగా సాగాయి. పోటీలను పాఠశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్ గౌడ్, పోటీల ఆర్గనైజర్ స్వామితో కలిసి ప్రారంభించారు. కార్యక్రమంలో జిల్లా క్రీడా సంఘం బాధ్యులు విట్టల్ రెడ్డి, నాందేవ్, జయశ్రీ, రాము, వినోద్, కృష్ణ చైతన్య పాల్గొన్నారు.

అండర్‌బ్రిడ్జిలో ఇరుక్కున్న వాహనాలు

ఆదిలాబాద్‌టౌన్: ఆదిలాబాద్ పట్టణంలోని చిల్కూరిలక్ష్మీనగర్ సమీపంలో గల అండర్ రైల్వే బ్రిడ్జిలో కారు, ఆటో ట్రాలీ ఎదురెదురుగా రావడంతో ఇరుక్కపోయాయి. దీంతో ఆదివారం దాదాపు 45 నిమిషాల పాటు ట్రాఫిక్ స్తంభించింది. బ్రిడ్జికి ఇరువైపులా వాహనాలు నిలిచిపోవడంతో ప్రజలు ఇబ్బంది పడ్డారు.

విద్యార్థుల ఆరోగ్యంపై శ్రద్ధ చూపాలి


వాటర్‌ప్లాంట్‌ను పరిశీలిస్తున్న ఐటీడీఏ డీడీ

ఇచ్చోడ: విద్యార్థులకు నాణ్యమైన విద్యాబోధన చేయడంతో పాటు వారి ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని ఐటీడీఏ డీడీ జాదవ్ వసంత్‌రావు అన్నారు. ఆదివారం మండలంలోని మేడిగూడ బాలికల, రాయిగూడ బాలుర, ఇచ్చోడ పోస్ట్‌మెట్రిక్ వసతి గృహాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాల పరిసర ప్రాంతాల్లో పారిశుధ్యంపై ఆరా తీశారు. కొంత మంది విద్యార్థుల ఆరోగ్యం సరిగా లేకపోవడంతో ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తీసుకెళ్లారు. మెనూ ప్రకారం భోజనం పెట్టాలన్నారు. ఆయన వెంట రాయిగూడ పీజీ హెచ్‌ఎం, డిప్యూటీ వార్డెన్, తదితరులు పాల్గొన్నారు.

అడవిపంది దాడిలో ఒకరికి గాయాలు

ఇచ్చోడ: మండలంలోని గుండివాగు గ్రామానికి చెందిన ముక్కుల సుదర్శన్ అనే వ్యక్తి అడవిపంది దాడిలో గాయపడ్డాడు. శనివారం పశువులు మేపుతుండగా.. ఒక్కసారి దాడి చేసి గాయపరిచింది. దీంతో ఆదిలాబాద్ రిమ్స్‌లో చికిత్స పొందుతున్నాడు. ప్రసుతం సుదర్శన్ పరిస్థితి నిలకడగా ఉన్నట్లు కుటుంబసభ్యులు తెలిపారు.

వ్యాధి నిరోధక టీకాలు వేయించాలి


టీకా వేస్తున్న ఎమ్మెల్యే అనిల్‌జాదవ్

నేరడిగొండ: మేకలు, గొర్రెలకు వ్యాధి నిరోధక టీకాలు వేయించాలని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో శనివారం మండల కేంద్రంలోని పశువైద్యశాలలో ఏర్పాటు చేసిన ఉచిత పీపీఆర్ టీకాల శిబిరాన్ని ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం మేకలు, గొర్రెలకు వ్యాధులు సోకకుండా వ్యాధి నిరోధక టీకాలు వేయించడం జరుగుతుందన్నారు. పాడి రైతులు, పశుపోషకులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో మండల పశువైద్యాధికారి రాథోడ్ జీవన్, మండల నాయకులు పాల్గొన్నారు.

ఏసీఎంవోం పోస్టులో పీజీహెచ్‌ఎంలను నియమించాలని వినతి

ఏసీఎంఓ పోస్టులో పీజీహెచ్‌ఎంలను నియమించాలని కోరుతూ ప్రభుత్వ ఉపాధ్యాయులు బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్‌ను కలిశారు. శనివారం మండల కేంద్రంలోని ఎమ్మెల్యే నివాసంలో కలిసి వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యా పర్యవేక్షణ కోసం రాష్ట్రంలోని అన్ని ఐటీడీఏలకు పీఎంఆర్‌సీని ఏర్పాటు చేసిన ప్రభుత్వం ఏసీఎంఓ పోస్టును సృష్టించిందని, ఆ పోస్టులో పీజీహెచ్‌ఎంలను నియమించేలా చూడాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పేదల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం


కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న శ్రీనివాసరెడ్డి

కైలాస్‌నగర్: ప్రజల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి కంది శ్రీనివాసరెడ్డి అన్నారు. ఆదిలాబాద్ పట్టణంలోని తాటిగూడ, శాంతినగర్ కాలనీలకు చెందిన పలువురు యువకులు మాజీ వైస్ చైర్మన్ జహీర్ రంజానీ ఆధ్వర్యంలో కాంగ్రెస్‌లో చేరారు. వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో నాయకులు లోక ప్రవీణ్ రెడ్డి, మహ్మద్ రఫీక్, కౌన్సిలర్లు వెంకన్న, నర్సింగ్ పాల్గొన్నారు.

- వినాయక చవితి వేడుకలు కాంగ్రెస్ ఆదిలాబాద్ అసెంబ్లీ ఇన్‌చార్జి కంది శ్రీనివాసరెడ్డి క్యాంపు కార్యాలయంలో శనివారం నిర్వహించారు. ప్రజా సేవాభవన్‌లో ఏర్పాటు చేసిన మండపంలో ప్రతిష్ఠించిన గణనాథుడికి కంది శ్రీనివాసరెడ్డి, సాయి మౌనరెడ్డి దంపతులు ప్రత్యేక పూజలు చేశారు.

పేకాట రాయుళ్లపై కేసు

బేల: మండలంలోని జూనోని, బాది గ్రామాల శివార్లలో ఆదివారం పేకాట ఆడుతూ పట్టుబడిన 11మందిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై రాధిక తెలిపారు. పక్కా సమాచారం మేరకు దాడి చేయగా జూనోని గ్రామ శివారులో ముగ్గురు పేకాట ఆడుతూ పట్టుబడ్డారని, వారి నుంచి రూ.21వేలు స్వాధీనం చేసుకున్నామని అన్నారు. బాది శివారులో పేకాట ఆడుతున్న ఎనిమిది మందిని పట్టుకొని వారి నుంచి రూ.2,900 స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

ఎస్సీ, ఎస్టీ రైట్స్ సొసైటీ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా నారాయణ

ఆదిలాబాద్‌రూరల్: ఆల్ ఇండియా ఎస్సీ, ఎస్టీ రైట్స్ ప్రొటెక్షన్ సొసైటీ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా జిల్లాకు చెందిన దుర్గే నారాయణ నియమితులయ్యారు. ఆదివారం హైదరాబాద్‌లో జరిగిన ఎన్నికల్లో తనను ఉపాధ్యక్షుడిగా నియమిస్తూ రాష్ట్ర అధ్యక్షుడు మురళీధర్‌రావ్ నియమాక పత్రం అందించడం జరిగిందన్నారు.

ఘనంగా కుంకుమార్చన


కుంకుమార్చనలో పాల్గొన్న మహిళలు

ఆదిలాబాద్: జిల్లా కేంద్రంలోని టీచర్స్ కాలనీలో వినాయక చవితి వేడుకల్లో భాగంగా రేణుక బాలాజీ అపార్ట్‌మెంట్‌లో ఆదివారం కుంకుమార్చన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. గణపతి ప్రతిష్ఠాపన రెండో రోజు కుంకుమార్చన కార్యక్రమంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో 40 మంది మహిమలు భక్తిశ్రద్ధలతో గణనాథుడిని కొలిచారు. కార్యక్రమంలో స్థానికులు లోక ప్రవీణ్ రెడ్డి, సందీప్ రెడ్డి, ప్రసాద్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.